
ప్రజాశక్తి

శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 | 5 | విజయనగరం





గరివిడి.. మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



కర్రివలసలో వర్షాభావంతో ఎదుగుదల లేని మొక్కజొన్న

పార్వతీపురం మన్యం జిల్లాలో మొక్కజొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతింది. విజయనగరం జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. అదును తప్పిన వర్షాలే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మన్యం జిల్లాలోని మొక్కజన్న రైతులు వాపోతుండగా, అసలు పూర్తిస్థాయిలో విత్తనాలు నాటేందుకు కూడా అవకాశం లేకపోయిందని విజయనగరం జిల్లాకు చెందిన వారు చెబుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వరి తరువాత అంతటి ప్రాధాన్యత గల పంట మొక్కజొన్న. ఈ రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 76వేల ఎకరాల్లో సాగవుతుంది. వరుణుడు అదును తప్పించడంతో ఈ రెండు జిల్లాల్లో భిన్నమైన రీతిలో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

దెబ్బతిన్న మొక్కజొన్న

- విజయనగరంలో తగ్గిన విస్తీర్ణం
- ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 36వేల ఎకరాలు కాగా, జూన్‌లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు 34,682 ఎకరాల్లో రైతులు వేశారు. అత్యధికంగా పాచిపెంట మండలంలో 15,430 ఎకరాలు, సాలూరులో 13,612 ఎకరాలు, మక్కువలో 1917ఎకరాల్లో మొక్కజొన్న సాగు నమోదైంది. మిగిలిన మండలాల్లో దాదాపు 500 నుంచి 1500 ఎకరాల వరకు నాటారు. ఆగస్టులో పొట్టవచ్చే సమయం నుంచి కంకికట్టే సమయం వరకు చుక్కనీరు లేకపోవడంతో మోడుబారిపోయాయి. పాచిపెంట మండలం పాచిపెంట, కర్రివలస, కోనవలస, మోసూరు తదితర గ్రామాల్లో ప్రజాశక్తి పరిశీలించగా ఏపుగా పెరిగిన మొక్కజొన్న కంకులు మోడువారుతూ కనిపించాయి. తరువాత వర్షాలు పడినా మొక్కలు తేరుకునే పరిస్థితి కనిపించలేదు. పంట వెన్నుపొడిచే సమయంలో వర్షాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని కర్రివలసకు చెందిన రైతు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సాలూరు, మక్కువ మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

విజయనగరం జిల్లాలో 40వేల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 24,055 ఎకరాల్లో మాత్రమే రైతులు నాటారు. తగిన వర్షాలు లేకపోవడంతో చాలా మంది రైతులు అరకొరగాను, కొంతమంది రైతులు పూర్తిగాను మొక్కజొన్న వేయడం మానుకున్నారు. దీంతో, కొన్ని మండలాల్లో విస్తీర్ణం తగ్గిపోగా, మరికొన్ని మండలాల్లో ఒక్క ఎకరాలో కూడా నాటని పరిస్థితి. పూసపాటిరేగ మండలంలో 820 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా కేవలం 15ఎకరాల్లో నలుగురు రైతులు మాత్రమే సాగుచేశారు. భోగాపురం మండలంలో 110 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా ఒక్క సెంటులో కూడా సాగు కాలేదు. డెంకాడలో 415 ఎకరాలకు గాను 37 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దాదాపు అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. మరోవైపు తోటపల్లి నీరు అందకపోవడం, వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో వరినాట్లు కూడా పూర్తికాలేదు. ఇటు మొక్కజొన్న విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పులపాలే



ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పులపాలైపోతాము. వర్షాలు అదును తప్పడం వల్ల పంట దిగుబడి మూడో వంతు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జూన్‌లో కురిసిన వర్షాలకు 2.50 ఎకరాల్లో మొక్కజొన్న నాటాను. దుక్కి, విత్తనాలు, డిఎపి, యురియా తదితర ఎరువులు తదితరాల మదుపు ఎకరాకు సుమారు రూ.30వేల చొప్పున మొత్తంగా రూ.75వేలకుపైగా ఖర్చు అయ్యింది. పంటలో ఎదుగుదల లేకపోవడంతో దిక్కుతోచడం లేదు.

సాముర్రోతు సుదర్శనరావు,
మొక్కజొన్న రైతు, కర్రివలస, పాచిపెంట మండలం

ఒక్క ఎకరాలోనూ నాటలేదు



నాకున్న భూమిలో మూడు ఎకరాల వరకు మొక్కజొన్న నాటేవాడ్ని. ఈ ఏడాది వర్షాభావం వల్ల ఒక్క ఎకరాలోనూ వేయలేదు. స్థానికంగా వర్షాలు కురవకపోయినా తోటపల్లి నీరు వస్తుందన్న ఆశ కూడా లేకపోవడంతో మొక్కజొన్న నాటేందుకు సాహశించలేక పోయాం. ఇటీవల వర్షాలు కురుస్తున్నప్పటికీ సీజన్ దాటుతుండడంతో సాగు ఆలోచన విరమించుకున్నాను.

- కె.గోవింద,
మొక్కజొన రైతు, కనిమెట్ట గ్రామం, పూసపాటిరేగ మండలం

ఐక్య పోరాటాలతోనే

స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ

బైక్ యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల, గరివిడి, రాజాం, విజయనగరం టౌన్

ఐక్య పోరాటాల ద్వారానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలమని సిపిఎం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోక నాధం అన్నారు. 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర' పేరిట సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్‌ర్యాలీ గురువారం విజయనగరం నుంచి నెల్లిమర్ల చేరుకుంది. అక్కడి నుంచి గరివిడి, రాజాం మీదుగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల చేరుకుంది. ఈ సందర్భంగా నెల్లిమర్ల మండలం మొయిద జంక్షన్, గరివిడి పెట్రోల్‌బంకు జంక్షన్, రాజాం అంబేద్కర్ జంక్షన్‌లో బైక్‌యాత్రకు పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు, స్కీం వర్కర్లు, ప్రజలు స్వాగతం పలికారు. గరివిడిలో బైక్ యాత్ర చేపట్టిన నాయకులపై పూలు చల్లి స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని నినాదాలు చేశారు. మోడీ పాలన తీరుపై పాటలు పాడుతూ డాన్సులు చేశారు. ఆయా సెంటర్లలోజరిగిన సభల్లో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా సి పిఎం ఆధ్వర్యంలో ఉక్కు రక్షణ బైక్ యాత్రను చేపట్టిందని తెలిపారు. పోరాటాల ద్వారా స్టీల్ ప్లాంట్ పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు. మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తోందని, అందులో భాగంగానే ఎల్ఐసి , బిఎస్ఎన్ఎల్, రైల్వే, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి పూనుకుందన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలని 1000రోజులుగా ప్రజలు, కార్మికులు పోరాటం చేస్తున్నారని, వారిని ప్రభుత్వం భయ పెడుతున్నా మొక్క వోని ధైర్యం తో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. అధికార వైసిపి, ప్రతిపక్షాలు టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను, ప్రైవేటీకరణను అడుకోవడం లేదని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై ఉత్తరాంధ్ర నుంచి సుమారు 2 లక్షల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని, అలాంటి పరిశ్రమను నేడు పోస్కో లాంటి కంపెనీలకు అమ్మేయాలని ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ఐక్య పోరాటాల ద్వారా పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు.



నెల్లిమర్లలో బైక్‌యాత్ర చేస్తున్న పాల్గొన్న సిపిఎం నాయకులు



విజయనగరంటౌన్.. గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, తదితరులు

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి శంకర్రావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు రామారావు, సిఐటియు టివి రమణ, కె.సురేష్, ఎ.జగన్మోహనరావు, బి.సుధారాణి, ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, బి.రమణ, కిల్లంపల్లి రామారావు, కె.రామ్మూర్తినాయుడు, ఎస్ఎఫ్ నాయకులు పి.రామ్మోహన్, ప్రభాకర్, జితేంద్ర, ఫ్యాకర్ కార్మికులు పాల్గొన్నారు.

గురజాడకు నివాళి

తొలుత విజయనగరంలో గురజాడ 161వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోక్‌నాథం, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. గురజాడ అప్పారావు స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు, భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్న పాలకుల విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. గురజాడకు నిజమైన వారసులు కమ్యూనిస్టు లేనని అన్నారు. అనంతరం రెండోరోజు బైక్‌ర్యాలీ ప్రారంభమైంది. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, రామ్మోహన్, పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

యువజనోత్సవాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఉత్సాహంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా స్థాయి యువజనోత్సవాలు గురువారం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగాయి. సెట్విజ్, నెహ్రూ యువ కేంద్ర, సీతం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు హాజరై వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారు. సాంస్కృతిక కళా వైభవం, జీవిత నైపుణ్యం, శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను తెలుపుతూ వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. సెట్విజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 15 రకాల క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ కౌశిక్, సీతం కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ రమణ మూర్తి, బ్రహ్మ కుమారి అన్నపూర్ణ, మెప్మా పీడీ సుధాకర్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవిందరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి సోమేశ్వరరావు, సంగీత కళాశాల అధ్యాపకురాలు బిందు తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద, గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. అతిథులంతా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ బలమైన లక్ష్యం ఏర్పాటు చేసుకొని దాని సాధన కోసం నిరంతరం తపించాలని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆశయ సాధన కోసం అకుంఠిత దీక్ష, ఏకాగ్రత చాలా అవసరమని పేర్కొన్నారు. పోటీతత్వం అలవర్చుకోవాలని, మానసిక ధైర్యంతో ముందుకు వెళ్లాలని హితవు పలికారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక చైతన్యం పొందడానికి అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం 15 రకాల క్రీడాంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. సీతం కళాశాల అధ్యాపకులు, సెట్విజ్, యువజన సర్వీసుల శాఖ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

గురజాడ గృహం అభివృద్ధికి జెడ్‌పి నిధులు : జెడ్‌పి ఛైర్మన్ • గురజాడ రచనలు అజరామరం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గురజాడ స్వగృహంలో ఆయన చిత్ర పటానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, గురజాడ కుటుంబ సభ్యులు ప్రసాద్, ఇందిర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ రచించిన దేశమంటే మట్టి కాదోయి గేయాన్ని ఆలపిస్తూ పెద్ద సంఖ్యలో విద్యార్థులతో గురజాడ జంక్షన్ వరకు గురజాడ వినియోగించిన వస్తువులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ గురజాడ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ తన రచనల ద్వారా దేశ భక్తిని పెంపొందించాలని 161 ఏళ్ల క్రితమే జాతికి దిశా నిర్దేశం చేసిన వ్యక్తి గురజాడ అని, ఇటీవల దేశ ప్రధాని మోడీ గారి నోట గురజాడ మాటలు వినిపించాయని గుర్తు చేసారు. అనేక మంది సందర్శకులు లైబ్రరీకి వస్తున్న దృష్ట్యా వారి సౌకర్యార్థం లైబ్రరీ లో మౌలిక వసతుల కల్పనకు జిల్లా పరిషత్ నుంచి నిధులను సమకూర్చనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. అందుకోసం ఒక కమిటీ ని ఏర్పాటు చేసి, ఏమేమి అవసరం అవుతాయో నివేదిక తయారు చేయాలని కలెక్టర్ కు కోరారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గురజాడ చిర స్మరనీయులని, వారి రచనలు ఎన్ని తరాలకైనా అనుసరణీయమని అన్నారు. గురజాడ గృహంలో గురజాడ వినియోగించిన వస్తువులను , గురజాడ స్టాంప్ ను చేతి రాతలను, కళ్లద్దాలను, గురజాడ సేకరించిన పుస్తకాలను , ఎగ్జిబిషన్ రూమ్‌లో గురజాడ సమకాలీన కవులు, మేధావుల చిత్ర పటాలను ఛైర్మన్, కలెక్టర్ సందర్శించారు. గోల్డెన్ హెరిటేజ్ అఫ్ విజయనగరం వారి వితరణతో గురజాడ గృహం లో సందర్శకుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను కూడా ఛైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మి నారాయణ, డిఐపిఆర్ఒ దున్నా రమేష్ , తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, గురజాడ సమాఖ్య ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, సూర్య లక్ష్మి, గోపాలరావు, సంగీత కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు గురజాడ గృహాన్ని సందర్శించారు. గురజాడ చిత్రపటానికి పూల మాలలను వేసి నివాళు లర్పించారు.

జెఎన్‌టియు జివిలో వేడుకలు

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో గురజాడ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. గురజాడ చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, అరసం అధ్యక్షులు జిఎస్ చలం, ఆలిండియా ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరుశివప్రసాద్, కార్యదర్శి శరత్చంద్ర జ్యోతిశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. వ్యాఖ్యాతగా అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, కోఆర్డినేటర్‌గా డాక్టర్ బి.నలిని వ్యవహరించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘంచే ముద్రించిన గురజాడ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు.

సాంఘిక పరివర్తనకు గురజాడ కృషి

తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మి నారాయణ అన్నారు. స్థానిక గురజాడ పాఠశాలలో ఏర్పాటుచేసిన సభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నేటి విద్యార్థులు గురజాడ అప్పారావు గార్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తను రచించిన 'కవిత స్రవంతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ఎంవిఆర్. కృష్ణాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతి శ్రీ, విజయనగరం జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు జి. ఎస్ . చలం , ఆర్. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గురజాడ స్వగృహంలో విగ్రహానికి జనసేన నాయకులు గురాన అయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ రోడ్డులో గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.రామచంద్రరాజు, విసినిగిరి శ్రీనివిసరావు, కాటం అశ్వని,మాతా గాయిత్రి, , దుప్పాడ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్‌పి ఛైర్మన్



కవితా స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

కొత్తవలస : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురజాడ విగ్రహానికి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

రామభద్రపురం : నాయుడువలస పాఠశాలలో గురజాడ చిత్రపటానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజా శేఖర్, శివున్నాయుడు, బొప్పే రవి, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ధర్మవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురజాడ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు రహీం షేక్ లాల్, శ్రావణి, లావణ్య, శివాజీ, రాజేష్, జయలక్ష్మి, పి.శ్రీరాములు పాల్గొన్నారు.

వేపాడ : ఆదర్శ పాఠశాలలో గురజాడ అప్పారావు చిత్రపటానికి ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

డెంకాడ : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన వై మహేష ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎఆర్ కానిస్టేబుల్‌కు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల శ్రీలంక దేశంలోని దియాగమ మహీంద రాజపక్స స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో విజయనగరం ఆర్మ్ రిజర్వు విభాగంలో కానిస్టేబులుగా పని చేస్తున్న వి.సన్యాసి నాయుడు ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన పి.సన్యాసి నాయుడు గురువారం ఎస్‌పి దీపికను మర్యాద పూర్వకంగా కలవగా, ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సన్యాసి నాయుడు క్రీడా స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని కొనియాడారు. ఆయనను ఆర్మ్ రిజర్వు డిఎస్‌పి యూనివర్స్, ఆర్ఐలు రమణమూర్తి, ఎన్. గోపాల నాయుడు తదితరులు అభినందించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అధికార్లు తొలగించారు. స్థానిక డైట్ కాలనీ సమీపంలోని విజయనగరం - నెల్లిమర్ల ప్రధాన రహదారి పక్కన సర్వే నెంబర్ 65/3లో ప్రభుత్వ భూమిగా గుర్తించిన 65సెంట్ల భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి దిన పత్రికలో కథనం రావడంతో రెవెన్యూ, నగర పంచాయతీ అధికార్లు స్పందించి అక్రమదార్లకు నోటీసులు జారీ చేశారు. కాగా గురువారం నిర్మాణాలను జెసిబితో తొలగించారు. అయితే అక్రమ నిర్మాణాలు తొలగించినపుడు అధికార్లకు వేధింపు ఫోన్‌కాల్స్ వచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న జెసిబి

ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలక ప్రక్రియ అని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని జాగ్రత్తగా తరలించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. భద్రంగా సురక్షితమైన ప్రదేశానికి ఆసుపత్రి వ్యర్థాలను తరలించి, వాటిని విభాగాల వారీగా వేరుచేసి సమర్థవంతంగా తొలగించే ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షక కమిటీ సమీక్షా సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణకు జిల్లాలో తీసుకున్న చర్యలను పొల్యూషన్ ఇంజినీర్ బిబి సరిత వివరించారు. ప్రతి ఆసుపత్రిలో నిర్దేశిత రంగుల్లో ప్రత్యేక చెత్త బుట్టలను ఏర్పాటు చేసి, వ్యర్థాలను వాటిల్లోనే వేయాల్సి ఉంటుందని చెప్పారు. అనుమతి పొందిన సంస్థ ద్వారా 48 గంటల్లోగా చెత్తను భద్రంగా తరలించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రయివేటు ఆసుపత్రులతోపాటు, ప్రభుత్వ ఆసుపత్రులు కూడా వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలు బయటి వ్యర్థాలతో కలిపి ఎక్కడికక్కడ పడేస్తే, వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల వీటి నిర్వహణకు ప్రత్యేక ప్రక్రియను పాటించాలని, ఖచ్చితంగా నిబంధనలను అమలు చేయాలని ఆదేశించారు. దీనికోసం ఆసుపత్రుల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విషయంలో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, నిర్లక్ష్యం వహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్లు, వైద్యారోగ్యశాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.


మానవహారం చేస్తున్న విద్యార్థులు

మెస్‌చార్జీలు పెంచాలని మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్షేమ హాస్టళ్లలో మెస్‌చార్జీలు పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు గురువారం నగరంలోని కోట జంక్షన్ వద్ద బిక్షాటన, అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము, ఉపాధ్యక్షులు ఎం.సోమ్కు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో వినూత్న మార్పులు తెస్తామని చెబుతూ అదే విద్యారంగాన్ని తుంగలోకి తొక్కుతున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. అద్దె బిల్డింగుల పేరుతో ఆర్‌ఓ ప్లాంట్ పెట్టకపోవడం సరికాదన్నారు. భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.రమేష్‌రాజు, నాయకులు భారతి, సంధ్య, సుష్మిత విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మెస్‌ఛార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వసతిగృహాల విద్యార్థులు పట్టణంలోని దేవి కూడలిలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రవి, నాయకులు రాము, భారతి, తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని సిహెచ్‌సిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం మాట్లాడిన ఆయన బొబ్బిలి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ 30 పడకల ఆస్పత్రికి ఉన్న సౌకర్యాలు కూడా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులను నియమించడంతో రోగుల తాకిడి పెరిగిందని, వారి కోసం ఒక ఫ్లోర్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులకు టెండర్లు పూర్తయినా పనులు చేపట్టడం లేదని, వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. రామభద్రపురం, లోచర్ల ఎత్తిపోతల పథకాలకు సంపూర్ణంగా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్టోబర్ 30న ఆశాల చలో ఢిల్లీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని అక్టోబర్ 30న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. గురువారం పట్టణంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, చట్టబద్ధత కల్పించాలని, పింఛను, గ్రాడ్యుటి సౌకర్యం కల్పించాలని చలో ఢిల్లీ చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లంక శాంతమ్మ, సభ్యులు మీసాల లక్ష్మి మాలతి, జయంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ మండల తహశీల్దార్‌గా నీలకంఠేశ్వర రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖ జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసి, ఉద్యోగోన్నతిపై మండలానికి వచ్చారు. గత తహశీల్దార్ ప్రసన్నరాఘవ వాలంటరీ రిటైర్మెంట్ పొందారు.

నెల్లిమర్ల : నూతన తహశీల్దారుగా డి. ధర్మరాజు గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహశీల్దారుగా పని చేసిన కెవి రమణ రాజు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడంతో ఇంతవరకు డిటి శైలజ తహశీల్దారుగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. విశాఖ జిల్లా గాజువాక మండలంలో ఎలక్షన్ డిటిగా పని చేసిన డి.ధర్మ రాజు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

సిఎం సహాయనిధి నుంచి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి-విజయనగరం

మానసిక వికలాంగురాలికి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి లక్ష రూపాయల సాయం అందింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ సత్యవతి తమ కుమార్తెకు మానసిక వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించాలని, ఇటీవల మరడాం పర్యటనలో సిఎం వైఎస్ జగన్మోహన రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సిఎం, లక్ష రూపాయల ఆర్థిక సాయం మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును లబ్దిదారు సత్యవతికి కలెక్టర్ గురువారం అందజేశారు.

వైసిపి మండల అధ్యక్షులు కొణిసికి సన్మానం

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని గెడ్డపువలసకు చెందిన మాజీ ఎంపిపి కొణిసి కృష్ణంనాయుడు వైసిపి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పట్టణానికి చెందిన వైసిపి నాయకులు ఆయన్ను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బొత్స, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తనపై నమ్మకం ఉంచి వైసిపి మండల అధ్యక్షత బాధ్యతలను అప్పగించారని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రమీలకుమార్, ఉపసర్పంచ్ బమ్మిడి కార్తిక్, డిసిసిబి డైరెక్టర్ శివుకు కాంతారావు, సీనియర్ నాయకులు నీలాతి సూర్యనారాయన, వార్డు మెంబర్లు వలిరెడ్డి వాసు, పుక్కళ్ళ నాగేశ్వరరావు, మజ్జి సంతోష్, విజినిగిరి ఈసు, వాళ్లే శ్రీనివాసరావు, బోడసింగి సత్యనారాయణ, కింతాడా కిరణ్, కృష్ణ, ములగాపు సతీష్, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

పనుల ప్రగతిపై డిప్యూటీ డిఇఒ ఆరా

ప్రజాశక్తి- రేగిడి

మనబడి, నాడు-నేడు పనులపై డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు ఆరా తీశారు. గురువారం సంకిలి, బూరాడ, కందిశ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పనులలో పురోగతి సాధించాలన్నారు. బై జ్యూస్ ట్యాబులు విద్యార్థులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఇఒ ఎంవి ప్రసాద్ రావు, బి ఎరకయ్య, కందిస కాంప్లెక్స్ చైర్మన్ నారాయణ, బురాడ కాంప్లెక్స్ పరిధిలోగల అందరూ ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు మోహన్‌రావు, వెంకటరమణ, శాంతిశ్రీ, జి కృష్ణ, ఏసి సూర్యారావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సోంపురంలో జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు గురువారం సందర్శించారు. పాఠ్యపుస్తకాలు, షూ, యూనిఫాం, బ్యాగు, వర్క్‌బుక్‌లతో విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. టోఫెల్, సిలబస్, ఆర్ఒ సిస్టమ్, పాఠశాల పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. డిఆర్‌పేట ప్రాథమిక పాఠశాలను కమిటీ చైర్మన్ ఎస్ఎస్ వల్లి పరిశీలించారు.

తెర్లాం : మండలంలోని కుమ్మరపేటలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఇఒ జె.త్రినాథరావు ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ ప్రణాళిక, పిల్లల హాజరు పట్టిక, బైజూస్ ట్యాబుల వినియోగంపై ఆరా తీశారు. జగనన్న విద్యా కానుక, మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు.

కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట, గజపతినగరం

చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు చేపట్టిన నిరసన దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. గురువారం జిల్లా పార్టీ కార్యాలయం (అశోక్‌బంగ్లా) వద్ద చేపట్టిన దీక్షలను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. అంతకుముందు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోస్ట్ కార్డు ఉద్యమంలో భాగంగా మేము సైతం చంద్రబాబుకు మద్దతు తెలుపుతూ పోస్ట్ కార్డుపై సంతకం చేశారు.


గజపతినగరం.. చంపావతి నదిలో జలదీక్ష చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

స్వేచ్ఛగా నినదించిన గళం

చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఏర్పాటు చేసిన ఫ్రీడం ఆఫ్ వాయిస్ కార్యక్రమం రాజకీయ పార్టీలకు అతీతంగా స్వేచ్ఛగా గళం వినిపించింది. హోటల్ మయూరలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచిన భారతదేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మన రాష్ట్రంలో అరాచకం నెలకుందని, చంద్రబాబు అక్రమ అరెస్ట్ దానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చని అన్నారు. టిడిపి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజులు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా రాష్ట్ర ప్రధాన ప్రతిపక్షనేత అరెస్ట్ అప్రజాస్వామికమని అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, సిపిఐ రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు దయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగేతర శక్తి పరిపాలనలో ప్రజలు నలిగిపోతున్నారని, ప్రజలలో చైతన్యం రావాలని అన్నారు.

బొబ్బిలి : టిడిపి అధినేత చంద్రబాబుపై ప్రభుత్వం రాజకీయ కుట్ర పన్నుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. చంద్రబాబు అరెస్టుపై బొబ్బిలిలో తొమ్మిదో రోజు నిరసన దీక్ష కొనసాగింది. దీక్షను బేబినాయన ప్రారంభించారు. దీక్షలో మెట్టవలస గ్రామ తెలుగు మహిళలు పాల్గొన్నారు.

గజపతినగరంలో చంద్రబాబు అరెస్టులకు వ్యతిరేకంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో వినూత్నరీతిలో జలదీక్ష చేపట్టారు. గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామ సమీపంలో చంపావతి నదిలో నీటి దీక్ష చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొరుపోలు రమేష్, చప్ప చంద్రశేఖర్, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, సర్పంచ్ రుంకాన అరుణ, లెంక చిన్నమ్నాయుడు, లెంక సత్యనారాయణ, బోని గోవింద, తదితరులు పాల్గొన్నారు,

గరివిడి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చీపురుపల్లిలో రిలే నిరాహారదీక్షలు గురువారం కొనసాగాయి. ఈ దీక్షలో తెలుగు యువత, టిడిపి నాయకులు దుర్గాసి కోటేశ్వరరావు, మీసాల కాశీ, చల్ల శ్రీరామ్, మంత్రి గోవింద, గంగుపల్లి జగదీష్, ముడిల రవణ, కర్రోతు పైడి నాయుడు, మీసాల శ్రీధర్, పనస రవి, నెమ్మాది శివ, వరపల శంకర్, సాలాపు వెంకటేష్, వెంపడాపు రామ్మూర్తినాయుడు, రౌతు కనక రాజు, పిన్నింటి వివేక్, చింత శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు బేబినాయన పాదయాత్ర ప్రారంభం

బొబ్బిలి : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన శుక్రవారం పాదయాత్ర చేపట్టనున్నారు. బొబ్బిలి నుంచి సింహాచలం వరకు చేపట్టే ఈ పాదయాత్ర పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రారంభం కానుంది. పాదయాత్రలో పాల్గొనేందుకు వందలాది మంది టిడిపి కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విజయనగరంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజును కలిసి పాదయాత్ర గురించి వివరించారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.


అశోక్‌గజపతిరాజును కలిసిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పూర్తి

ఓటుకు ఆధార్ అనుసంధానం స్వచ్ఛందం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ తుదిదశకు చేరింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 1847 పోలింగ్ స్టేషన్లు ఉండనున్నాయి. ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల రాజాం నియోజకవర్గంలోని కేవలం ఒక్క పోలింగ్ స్టేషన్ రద్దు కానుంది. 49 పోలింగ్ స్టేషన్ల స్థానాలు మారనున్నాయి. మరో 99 పోలింగ్ స్టేషన్లలో స్వల్ప మార్పులు చోటుచేసుకొని పేర్లు మారనున్నాయి. ఈ వివరాలను గురువారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. కలెక్టరేట్‌లో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో, ఆయా నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మాట్లాడుతూ, రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలిపారు. నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పులను వివరించారు. తుది జాబితా ఖరారు చేసేముందు చివరిసారిగా ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారు. ఒకటిరెండు విషయాల్లో ఇంకా కొద్ది సమయం కావాలని కోరారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చిన ధరఖాస్తులు, వాటిపై తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఓటుకు ఆధార్ అనుసంధానం స్వచ్ఛందమేనని, తాత్కాలికంగా ఈ ప్రక్రియ ఆగిందని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎంవి సూర్యకళ, ఎం.అప్పారావు, బి.సుదర్శనదొర, వెంకటేశ్వర్రావు, పద్మలత, మున్సిపల్ కమిషర్ ఆర్.శ్రీరాములు నాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, డిటిలు, విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు ఐవిపి రాజు, రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, కె.తవిటిరాజు, బి.శివప్రసాదరెడ్డి, ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు యుటిఎఫ్ ప్రచార జాతా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు విజయవాడలో సిద్ధార్థ ఇం/తీనీరింగ్ కాలేజీలో అక్టోబర్ 1న జరగనున్నాయి. యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా సెప్టెంబర్ 21 నుండి 29 వరకు ఇచ్ఛాపురం నుండి విజయవాడ వరకు, హిందూపురం నుంచి విజయవాడ వరకు రెండు ప్రచార జాతాలు అన్ని జిల్లాలలో ముఖ్య పట్టణాలను కలుపుకొని పర్యటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాలో ఈనెల 22న బొబ్బిలి, గజపతినగరం, విజయనగరం, 23న కొత్తవలసలో జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్ కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాద్ రావు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి.రాంప్రసాద్, పి.రామకృష్ణ, జి. రమణ, ఎస్ వెంకటరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



యుటిఎఫ్ ప్రచారజాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


విద్యార్థినులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ధరణి

గురుకుల విద్యార్థులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో బక్కునాయుడుపేట వద్దనున్న బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఆధ్వర్యాన వైద్యసేవలందించారు. 473 మంది బాలికలకు రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.ఎం.ఫ్లోరెన్స్. సిహెచ్‌ఒ ఆంజనేయులు, ఉషారాణి, శారద పాల్గొన్నారు.

మారనున్న రాజకీయ స్వరూపం

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయ స్వరూపాన్ని మార్చేందుకు దోహదం చేస్తుందని మానవ హక్కుల సంఘం మహిళా విభాగం సౌత్ ఇండియా అధ్యక్షురాలు చింతా శారద ఒక ప్రకటనలో తెలిపారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల వారి రక్షణ కోసం చట్టాలను చేసుకోవచ్చని చెప్పారు. నిష్పక్షపాతంగా మహిళాశక్తితో మేధస్సు, ఓర్పు, సహనంతో ముందడుగు వేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

బొబ్బిలి : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుందామని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు కోరారు. ఈ నెల 24న బొబ్బిలిలో తాండ్ర పాపారాయుడు బొమ్మ కూడలిలో నిర్వహించే ఉక్కు రక్షణ యాత్ర సభను విజయవంతం చేయాలని గురువారం పట్టణంలో ప్రచారం చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు సిపిఎం చేపట్టిన పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. ప్రచారంలో నాయకులు బంగారు యుగంధర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గుర్ల

చదువుతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. మండలస్థాయి ఉన్నత పాఠశాల అండర్14, అండర్ 17ల ఆటల పోటీలను గురువారం గుర్ల జూనియర్ కళాశాల ఆవరణలో ఆమె ప్రారంభించారు. విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో రాణించి మండలానికి ప్రత్యేక గుర్తింపు తేవాలన్నారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు.

అనంతరం ఎంపిపి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, ఎంపిటిసి జోగి నాయుడు, ఇజ్జిరోతు ప్రసాదు, ఎంఇఒ భాను ప్రకాష్, శ్రీనివాసరావు, కాలేజి ప్రిన్సిపాల్ రామకృష్ణ, వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు పరిశీలన

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని వల్లాపురంలో జరుగుతున ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని గురువారం వ్యవసాయ శాఖ జెడి రామారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 70శాతం ఇ క్రాప్ జరిగిందన్నారు. మండల వ్యవసాయ అధికారులు నివేదిక ఇవ్వడంతో ఇ క్రాప్ చేసే సమయంలో ఏమైనా తప్పులు జరిగాయా అన్న విషయాన్ని ఆయన పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ మీద ఉన్న పంటలు, రికార్డులలో ఉన్న పంటలు సరిపోవడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి తిరుపతి రావు, వల్లాపురం సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న జెడి రామారావు

ప్రజలకు జవాబిదారీగా ఉండాలి

రేగిడి : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబిదారితనంగా ఉండాలని ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. గురువారం అంబకండి గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. ముందుగా రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అర్జీలు స్వీకరించాలన్నారు. సమయాలకు ఉద్యోగుల హాజరు కావాలన్నారు. ఎంపిడిఒతో పాటు పంచాయతీ కార్యదర్శి హేమసుందర్ ఉన్నారు.

ఎంబిబిఎస్ కౌన్సిలింగ్ నిబంధనలకు విరుద్ధం

రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఎంబిబియస్ రెండో దశ కౌన్సిలింగ్‌ను తక్షణమే రద్దు చేసి, నష్టపోయిన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిసిసి అధ్యక్షులు రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్‌కు వినతినిచ్చారు. సుప్రీంకోర్టు నిబంధన మేరకు మొట్టమొదటి ఓపెన్ కేటగిరి సీట్లను కేవలం ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని, 54 వేల ర్యాంకు పొందిన బిసి అభ్యర్థికి రిజర్వేషన్ కేటగిరి సీటు కేటాయించి 62వేల ర్యాంకు పొందిన అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో ఏ విధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ సెల్ చైర్మన్ శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ శ్రీనివాసరావు, జమ్ము ఆదినారాయణ, మైనార్టీ విభాగానికి చెందిన కరీం మరియు షరీఫ్, సూర్యనారాయణ, మువ్వల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ క్లీనింగ్ సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చెత్తను సేకరించేందుకు ప్లాస్టిక్ డబ్బాలు, టాయిలెట్ క్లీనింగ్ సామాగ్రిని స్థానిక ఎంఇఒ కార్యాలయం నుండి పాఠశాలకు గురువారం పంపిణీ చేశారు. సుమారు 15 వేల రూపాయలు విలువ చేసి సంవత్సరం సరిపడే టాయిలెట్ క్లీనింగ్ సామాన్లు, చెత్త వేసుకునేందుకు ప్లాస్టిక్ డబ్బాలు, బకెట్లు, జగ్గులు పాఠశాలకు పంపించారు. ఐదు లీటర్ల లిక్విడ్, 22 చెత్త వేసే పెద్ద బకెట్లు, రెండు నీళ్ళ పోసుకునేందుకు పెద్ద బకెట్, ఒకటి చిన్న బకెట్, రెండు జగ్గులు ఇచ్చారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఈ సామగ్రిని అందించారు. మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 53 ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఈ సామగ్రిని అందించనున్నట్లు సిఆర్‌ఎంటిలు భాస్కర్ రావు, శ్రీలక్ష్మి, ఈశ్వరమ్మ, శ్రీను, కృష్ణ మహేష్ తెలిపారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణ

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

ఎంపిడిఒ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీపై సంబంధిత అధికారులు, సిబ్బందితో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ గురువారం సమీక్షించారు. పనిదినాల కల్పన, చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్మాణాలు, పనుల నిర్వహణ, వాటి వివరాలు, వేతన, పనుల బిల్లుల చెల్లింపులు, ఎం.బుక్ నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించారు. జగనన్న కాలనీల్లో సోకుపిట్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. బిల్లులు చెల్లింపులు పెండింగ్ ఉంటే తక్షణమే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎం.బుక్ నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, ఎపిఒ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL DISTRICT JUDGE CUM MACT AT VIZIANAGARAM
M.V.O.P 374/2022

Between:
B.Bhavani and others .....Petitioners
And:
V. Apparao and others ...Respondents

NOTICE

2nd Respondent: Mekala Naveen, S/o. Venkata Ramana, Owner of motor cycle AP 39LK 5763, Door No:2-31, Kumbavari street, Cheepuruvalasa Village, Kothavalasa Mandal, Vizianagaram District.

Please take notice the above petitioners filed the above O.P. for grant of compensation on the event of death of late Dakarapu Govinda and the matter is posted to 20.10.2023 for your appearance before the above Honourable court at **10:30 AM** either personally or through an Advocate duly authorized by you. If you fails to appear before the above Court on **20.10.2023 at 10:30 A.M.** the matter will be decided as per the records available on record

U.V.RAJESH
Advocate for Petitioners
Vizianagaram
Cell: 9440309333

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE COURT CUM SPL MOBILE COURT AT VIZIANAGARAM
O. S. 187 / 2021

Between:
Reddi Srinivas ......plaintiff
And:
Kothapalli Vara Prasad Rao.....Defendant

DEFENDANT:
Kothapalli Vara Prasad Rao S/o Simhachalam, Hindu, aged 43 years, residing at H.No 2-153, Jaddetivalasa village, Jami Mandal, Vizianagaram dist.

పై నెంబర్ దావాలో మీ యెక్క హాజరు నిమిత్తం పై కోర్ట్ వారు పలుమార్లు మీకు కోర్ట్ ద్వారాను మరియు రిజిస్ట్రార్ పోస్ట్ ద్వారాను కోర్ట్ కి హాజరు కమ్మని సమన్స్ జారీ చేసినారు. అయినప్పటికి మీరు వాటిని ఉద్దేశ పుర్వకముగాను తీసుకొనలేదు, మరియు కోర్ట్ కి హాజరు కాలేదు. అందుకు మీ హాజరు నిమిత్తిము తేది: 16-10-2023 దిన పైన తెలిపిన కోర్ట్ లో హాజరు కొరుకు అదేశియించు ఉన్నారు. కావున మీరు **తేది:16-10-2023 దిన ఉదయం గం:10-30** నిమిషాలుకు మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలకముగా తెలుయుజేయుచున్నం అట్లు మీరు కోర్ట్ కి హాజరు కాని పక్షంలో మీ పై పరోక్షముగా శ్రీ కోర్ట్ వారు చర్య తీలుకుందురు అని తెలుయుజేయుడం ఆయనిది.

A. HARISH
R. RAMAKRISHNA
ADVOCATES
Opp: Dist CourtComplex, Vizianagaram
Ph: 9494333319, 9490682844

IN THE HONOURABLE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
O. S. 627 / 2022

Between:
Nemmadi Rohit Kumar and 3 others ...Plaintiffs
And:
Majji Rajesh ......Defendant

DEFENDANT:
Majji Rajesh S/o late Suryanarayana, Hindu, aged 35 years, Present Residing at of D. No. 16-65, C/o Netheti Nagamayya, Sarswathi Nilyam, 1st Line, RMS Colony, Gajularega, Vizianagaram town & Dist.

పై నెంబర్ దావాలో మీ యెక్క హాజరు నిమిత్తం పై కోర్ట్ వారు పలుమార్లు మీకు కోర్ట్ ద్వారాను మరియు రిజిస్ట్రార్ పోస్ట్ ద్వారాను కోర్ట్‌కి హాజరు కమ్మని సమన్స్ జారీ చేసినారు. అయినప్పటికి మీరు వాటిని ఉద్దేశ పుర్వకముగాను తీసుకొనలేదు, మరియు కోర్ట్‌కి హాజరు కాలేదు. అందుకు మీ హాజరు నిమిత్తిము తేది: 03-10-2023 దిన పైన తెలిపిన కోర్ట్‌లో హాజరు కొరుకు అదేశియించు ఉన్నారు. కావున మీరు **తేది: 03-10-2023 దిన ఉదయం గం: 10-30** నిమిషాలుకు మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలకముగా తెలుయుజేయుచున్నం అట్లు మీరు కోర్ట్ కి హాజరు కాని పక్షంలో మీ పై పరోక్షముగా శ్రీ కోర్ట్ వారు చర్య తీలుకుందురు అని తెలుయుజేయుడం ఆయనిది.

A. HARISH
R. RAMAKRISHNA
ADVOCATES
Opp: Dist CourtComplex, Vizianagaram
Ph: 9494333319, 9490682844